క్లుప్తంగా

బాధిత కుటుంబానికి సహాయం



బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

దత్తిరాజేరు: టి.బూర్జవలసలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమై, సర్వం కోల్పోయిన చింత గడ ప్రసాద్ కుటుంబానికి రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు బుధవారం తమవంతు సహాయం చేశారు.రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు ముడిదాపు రాము ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, టార్పాలిన్లు, రగ్గు అందజేశారు. సర్పంచ్ మంత్రి క్రాంతికుమార్, మాజీ ఎంపీపీ రాజేశ్వరి పాల్గొన్నారు.

రబీ పంటల నమోదు ప్రక్రియ పరిశీలన



జనుము పంటను పరిశీలిస్తున్న ఏడీ విజయ, తదితరులు

కొత్తవలస: పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సంతపాలెం గ్రామంలో వ్యవసాయ సిబ్బంది బుధవారం చేపట్టిన రబీ పంటల నమోదు ప్రక్రియను కొత్తవల స సబ్‌డివిజన్ ఏడీ ఎల్.విజయ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటల వివరాలను ఈ–పంట యాప్‌లో నమోదు చేసిన తర్వాత రైతు సేవా కేంద్రం వద్ద ప్రదర్శించాలని సిబ్బందికి సూచించారు.అలాగే రైతులు భూఆధార్ కోసం తమ వివరాలను ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని చెప్పారు. ఆమె వెంట ఏఓ మాధురీశరణ్య, వీఏఏలు కె.హేమ, ఎస్.దుర్గారావు ఉన్నారు.

వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే పరిశీలన

మెరకముడిదాం: మండలంలోని ఊటపల్లి గ్రామంలో సచివాలయ సిబ్బంది బుధవారం నిర్వ హించిన వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేను ఎంపీడీఓ జి.భాస్కరరావు పరిశీలించారు.గ్రామంలో ఎంత మేరకు సర్వే పూర్తయ్యిందని సిబ్బందిని ఆరా తీశారు. సర్వేలో సేకరించిన సమాచారాన్ని వెంటనే యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం గ్రామసచివాలయాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

జీవాల్లో కాలి పుండ్ల వ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పశువైద్య కళాశాల వైద్యాధికారులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): సన్న జీవాల్లో వచ్చే కాలి పుండ్ల వ్యాధిపై కొండపాలెం రైతు సేవా కేంద్రంలో గరివిడి పశువైద్య కళాశాల ఆధ్వర్యంలో గొర్రెలు, మేకల కాపరులకు బుధవారం అవగాహన కల్పించారు. గరివిడి పశువైద్య కళాశాలకు చెందిన ఆల్‌ఇండియా నెట్‌వర్క్ ప్రాజెక్టు సహ పరిశోధకులు డాక్టర్ జి.శివరామకృష్ణ, డాక్టర్ ఐ.హేమంత్, పశువైద్యాధికారి శ్రీనివాసులు గొర్రెలు,మేకల్లో కాలి పుండ్ల రావడానికి కారణాలను వివరించారు. వ్యాధి సోకిన జీవాలను గుర్తించుట, వ్యాధి లక్షణాలు, వాటి నివారణ చర్యలు, ప్రథమ చికిత్స, మందుల వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.జీవాలకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని,సకాలంలో టీకాలు వేయించాలని సూచించారు.

గుర్తింపు... గౌరవం కోసం

- స్టైఫండ్, వీసీఐ గుర్తింపు కోసం గరివిడి వెటర్నరీ యూనివర్సిటీ బీవీఎస్ విద్యార్థుల పోరాటం
- నెల రోజులుగా రిలే నిరాహార దీక్షలు
- కనికరించిన కూటమి ప్రభుత్వం
- విద్యార్థులను భయాందోళనలకు గురి చేస్తున్న ప్రభుత్వ చర్యలు



గరివిడి శ్రీ వెంకటేశ్వర పశువిశ్వవిద్యాలయం ప్రధాన గేటు వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న బీవీఎస్ విద్యార్థులు(ఫైల్)

చీపురుపల్లి: వారేమీ గొంతెమ్మ కోరికలు కోరడం లేదు. తగిన గౌరవం, గుర్తింపు ఇస్తే చాలని అంటున్నారు. వారే గరివిడిలోని శ్రీ వెంకటేశ్వర పశువిశ్వ విద్యాలయంలో బ్యాచలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ (బీవీఎస్) చదువుతున్న విద్యార్థులు. ఎంబీబీఎస్ చదివే మెడికోలు మనుషులకు వైద్యం చేస్తే.. బీవీఎస్ చదువుతున్న తాము మూగ జీవాలకు వైద్యం చేసి ప్రాణం పోస్తామని, అలాంటి తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువిశ్వ విద్యాలయంలో విద్యార్థులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 37 రోజులుగా మండు టెండలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం వారిపై కరుణ, జాలి చూపించడం లేదు సరి కదా యూనివర్సిటీ ముసుగులో వారిని భయాందోళనలకు గురి చేసేలా చర్యలు చేపడుతోంది. దీక్షలు విరమించి తరగతుల్లో చేరకపోతే వసతి గృహాలు మూసివేస్తామని హెచ్చరికలు జారీ చేయడమే కాకుండా ఈ నెల 3న వసతి గృహాలు మూసివేసే వరకు వెళ్లింది. దీంతో విద్యార్థులు అంతా మరింత ఉద్యమ బాట పట్టారు. యూనివర్సిటీ ప్రధాన గేటుకు అడ్డంగా బైఠాయించి నిరసన ఉధృతం చేశారు. కళాశాల అసోసియేట్ డీన్ నుంచి అధ్యాపకులు, సిబ్బందిని లోపలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో యూనివర్సిటీ అధికారులు వసతి గృహాలను తెరిపించాల్సి వచ్చింది. ప్రభుత్వం భయపెట్టిందుకు చూస్తున్నప్పటికీ విద్యార్థులంతా ఒక్కటిగా నిలిచి తమ డిమాండ్ల సాధనకు నిరసన దీక్షలు కొనసాగిస్తున్నారు.

మెడికోలతో సమానంగా స్టైఫండ్ ఇవ్వాలి



ప్రస్తుతం ఇస్తున్న స్టై ఫండ్‌ను పెంచాలని కోరుతూ పోరాటం చేస్తున్నాం. ప్రస్తుతం వెటర్నరీ విద్యార్థులకు అందిస్తున్న స్టైఫండ్ ఏమాత్రం సరిపోవడం లేదు. ఎంబీబీఎస్ విద్యార్థులకు ఇస్తున్న స్టైఫండ్‌తో సమానంగా మాకు కూడా రూ. 25,000 ఇవ్వాలి. ఇతర రాష్ట్రాల్లో ఇస్తున్న మాదిరిగా స్టైఫండ్ ఇస్తూ, మా సమస్యలను పరిష్కరించాలి.

– ఎం. లీలామనోహర్, ఫైనల్ ఇయర్ స్టూడెంట్, గరివిడి వెటర్నరీ యూనివర్సిటీ

వీసీఐ గుర్తింపు లేకపోతే భవిష్యత్ లేదు



కళాశాలకు వీసీఐ గుర్తింపు లేకపోతే మా విద్యార్థులకు భవిష్యత్ ఉండదు. విద్యాభ్యాసం పూర్తి చేసుకుని ఈ ఏడాది తాము కళాశాల నుంచి రిలీవ్ కాబోతున్నాం. వీసీఐ గుర్తింపు లేని కారణంగా ఇంటర్న్‌షిప్, ఎన్‌రోల్, పీజీ ఎంట్రన్స్‌కు అవకాశం ఉండదు. పరిస్థితి ఇలా ఉంటే ఎలా స్థిరపడగలుగుతాం. మా భవిష్యత్ ఏంటో మాకు అర్థం కావడం లేదు. మా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి భవిష్యత్‌కు దారి చూపించాలి.

– ఓ.సునీత, ఫైనల్ ఇయర్ స్టూడెంట్, గరివిడి వెటర్నరీ యూనివర్సిటీ

చలించని ప్రభుత్వం

గరివిడిలోని పశువిశ్వ విద్యాలయంలో బ్యాచలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్(బీవీఎస్) కోర్సులో 320 మంది విద్యార్థులు చదువుతున్నారు. మెడికోలతో సమానంగా నెలకు రూ.25 వేలు స్టైఫండ్ ఇవ్వాలని, స్థానిక కళాశాలకు వీసీఐ (వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) గుర్తిం పు కల్పించాలని కోరుతూ విద్యార్థులు ఫిబ్రవరి 3న రిలే నిరాహార దీక్షలు ప్రారంభిం చారు. 37 రోజులుగా కళాశాల ఎదుట టెంట్లు వేసుకుని రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు.రాష్ట్రంలో గరివిడితో పాటు ప్రొద్దుటూరు, గన్నవరం, తిరుపతిలో ఉన్న నాలుగు కళాశాలల్లోను విద్యార్థులు రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నారు. దీక్షలు ప్రారంభించి నెలరోజులు గడిచిపోయినా ప్రభుత్వంలో కనీసం చలనం రావడం లేదు.

ఇదేం ప్రజాస్వామ్యం..!



ప్రజాచైతన్య యాత్రలో భాగంగా ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు, రైతులు

శృంగవరపుకోట: చిన్న, సన్నకారు రైతుల నుంచి భూములు లాక్కోవడమే ప్రజాస్వామ్యమా అంటూ సీపీఎం నేతలు ప్రభుత్వం తీరుపై ధ్వజమెత్తారు. ఎస్.కోటలో బుధవారం నిర్వహించిన ప్రజాచైతన్య యాత్రలో భాగంగా 516బీ జాతీయ రహదారి బైపాస్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసితులు, జగనన్నకాలనీ వాసులు ఇచ్చిన వినతులపై సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ తీవ్రంగా స్పందించారు. జాతీయ రహదారి కోసం వెంకటరమణపేట నుంచి బొడ్డవర వరకూ 33 ఎకరాలను రైతుల నుంచి రెవెన్యూ శాఖ లాక్కోవడానికి సిద్ధమయ్యిందన్నారు. ఇప్పటికే ఆ ప్రాంతంలో సుజల స్రవంతి కాలువ కోసం భూములు తీసుకున్నారని, ఇప్పుడు బైపాస్ నిర్మాణం కోసమని మరోమారు అదే ప్రాంత రైతుల నుంచి భూములు లాక్కోవడం అన్యాయం కాదా అన్ని ప్రశ్నించారు. ఇటీవల భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచిన ప్రభుత్వం రైతులకు నష్ట పరిహారం చెల్లింపులో మాత్రం రూల్స్ చెబుతోందన్నా రు. రైతులకు చెప్పి నోటిఫికేషన్ ఇచ్చారా, వారికి చెప్పి ఫ్లగ్ మార్కింగ్ చేశారా అని ప్రశ్నించారు. ఇప్పుడు భూములు ఇవ్వాల్సిందే అంటే ఇది నియంతృ త్వం కాదా అని నిలదీశారు. భూములు బలవంతంగా లాక్కోవాలని చూస్తే పోరాటం చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. జగనన్న కాలనీ లో మౌలిక సౌకర్యాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించాలని, కాలనీలు ఎవరి హయాంలో ఏర్పాటు చేసినా, అక్కడ ఉన్నది ప్రజలు అన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తుంచుకోవాలన్నారు. ప్రజాసమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 18, 19 తేదీల్లో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని తెలిపారు. అనంతరం రైతుల తరఫున తహసీల్దార్ అరుణకుమారికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి మద్దిల రమణ, నాయకులు సీహెచ్.ముత్యాలు, ఎస్.అర్జున్, పి.సూరిబాబు, ఎం.సత్యారావు, పి.రమణ, పి.కృష్ణ, ఎం.రాంబాబు, డి.జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

16న మజ్జిగౌరి,భద్రకాళి అమ్మవార్ల జాతర

దత్తిరజేరు: పెదమానాపురం సంతతోటలో మజ్జిగౌరి, భద్రకాళి అమ్మవార్ల ఆలయం వద్ద ఈనెల16వ తేదీన జాతర నిర్వ హించనున్నట్లు, ఆలయ నిర్వాహకులు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత 15 సంవత్సరాలుగా ఏటా జాతర నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జాతర రోజున అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయనున్నామని, రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

బొండపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల14న మండల సర్వసభ్య సమావేశం నిర్వ హించనున్నట్లు ఎంపీపీ చల్లా చలం నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండలంలోని అన్ని శాఖ ల అధికారులు హాజరు కావాలని కోరారు.

చెడు వ్యసనాలకు బానిస కావొద్దు



అవగాహన కల్పిస్తున్న సీఐ జి.ఏ.వి.రమణ

దత్తిరాజేరు: యువత చెడు వ్యసనాలకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని గజపతినగరం సీఐ జి.ఏ.వి. రమణ సూచించారు.మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలు, ట్రాఫిక్ నిబంధనలపై పెదమానాపురం గ్రామంలోని యాతవీధి లో స్థానికులు, యువతకు బుధవారం సాయంత్రం అవగాహన కల్పించారు. కొద్దిరోజుల క్రితం గంజాయి విక్రయించడానికి గ్రామానికి వచ్చిన సాలూరు యువకులను పట్టుకుని అప్పగించిన యాత వీధి వాసులను సీఐ అభినందించారు.గంజాయి విక్రయించినా, వినియోగించినా నేరమేనని అన్నారు. చిరు వ్యాపారాల పేరుతో గ్రామంలోకి వచ్చి ఎవరైనా గంజాయి విక్రయిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఎస్ఐ జయంతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 41మంది ఎంపిక



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న అధికారులు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేకేసీ, ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో బుధవారం జాబ్ మేళా నిర్వహించారు. జేకేసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ జి.ఈరన్న మాట్లాడుతూ జాబ్‌మేళాకు వివిధ ప్రాంతాల నుంచి 154 మందికిపైగా యువకులు హాజరు కాగా, వారిలో 41 మంది దివీస్ లేబరేటరీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారని చెప్పారు. ప్రిన్సిపాల్ సీహెచ్.కేశవరావు మాట్లాడుతూ నిరుద్యోగులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి డి.అరుణ మాట్లా డు తూ ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో ప్రతి నెలా జాబ్‌మేళా నిర్వహించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఏపీఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్‌లు భాస్కరరావు, యశ్వంత్, వైస్ ప్రిన్సిపాల్ కె.వాసుదేవరావు, లెక్చరర్లు వి.సుధీర్, సీహెచ్.శ్రీనివాసరావు, ఆర్.శ్రీలక్ష్మి, డి.లక్ష్మణ్, కె.అప్పలరాజు, డి.హైమావతి, డి.రామకృష్ణ, శివకుమార్, కె.భాస్కరరావు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి వితరణ

గరివిడి మండలంలోని కొండలక్ష్మీపురం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్థానిక సర్పంచ్ పొండ్రంకి కామేశ్వరరావు పరీక్ష సామగ్రిని వితరణ చేశారు. పాఠశాలలో బుధవారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో హెచ్‌ఎం పి.వి.బాబూరావు సమక్షంలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. విద్యార్థులు అంతా ఉత్తమ ఫలితా లు సాధించాలని ఆకాంక్షిస్తూ, ఆశీర్వదించారు.

– చీపురుపల్లిరూరల్(గరివిడి)



ఎడ్ల పరుగు పోటీలు

వేపాడ మండలంలోని వీలుపర్తి గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ పునః ప్రతిష్ఠ, ఎస్.కోట మండలంలోని వెంకటరమణపేటలో ఎల్లా రమ్మ తీర్థం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఎడ్ల పరుగు పోటీలు ఉల్లాసంగా, ఉత్కంఠగా సాగాయి. విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు.

– శృంగవరపుకోట



వీలుపర్తిలో..



వెంకటరమణపేటలో..

విద్యాభివృద్ధికి కృషి

బాలికల విద్యాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామని విశాఖపట్నానికి చెందిన నాన్హి కలి ప్రాజెక్టు వర్కర్ పద్రి కుమారి తెలిపారు. ఎల్.కోట లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, కొత్తవలస మండలంలోని దెందేరు, కొత్తవలస ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థినులకు బుధవారం బ్యాగ్‌లు, నోట్ పుస్తకాలు, బూ ట్లు, సాక్సులు, టీషర్టులు, శానిటరీ న్యాప్కిన్స్, తదితర సామగ్రితో కూడిన కిట్లు అందజేశారు. నాన్హి కలి ప్రా జెక్టు వర్కర్ కుమారి మాట్లాడుతూ 6వ తరగతి నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థినులను చదువు, క్రీడల్లో ప్రోత్సహించేందుకు హెచ్‌పీసీఎల్ సహకారంతో ఈ కిట్లు అందజేస్తున్నామని చెప్పారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

– లక్కవరపుకోట/కొత్తవలస




విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు



మాట్లాడుతున్న ఎస్‌బీఐ విశాఖ జోనల్ ఏజీఎం సురేష్‌కుమార్

చీపురుపల్లిరూరల్: విధుల్లో నిర్లక్ష్యం వహించినా, ఖాతాదారులతో అమర్యాదగా ప్రవర్తించినా ఉపేక్షించేది లేదని ఎస్‌బీఐ విశాఖ జోనల్ ఏజీఎం ఎం.సురేష్‌కుమార్ చీపురుపల్లి ఎస్‌బీఐ శాఖ ఉద్యోగులను హెచ్చరించారు. చీపురుపల్లి ఎస్‌బీఐ ఉద్యోగుల్లో ఒకరిద్దరను మిన హాయిస్తే మిగతావారు సక్రమంగా పని చేయడం లేదని, అమర్యాదగా ప్రవర్తిస్తున్నారని, ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ ఇటీ వల కొంతమంది ఖాతాదారులు స్టేట్‌బ్యాంకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎస్‌బీఐ విశాఖ జోనల్ ఏజీఎం సురేష్‌కుమా ర్ బుధవారం సాయంత్రం స్థానిక స్టేట్‌బ్యాంకును సంద ర్శించారు. బ్యాంకు ఉద్యోగులు, ఫిర్యాదుదారులు, ఖాతాదారులతో సమావే శమయ్యారు. ఖాతాదారుల సమస్యలను తెలుసుకున్నారు.బ్యాంకు పని వేళలను పాటించకుండా సాయంత్రం నాలుగు గంటలకే మూసేస్తున్నారని, నాలుగు గంటలకు ఒక్క నిమిషం దాటినా సేవలందించకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఖాతాదారులు ఏజీఎం కు వివరించారు. ఏజీఎం స్పందిస్తూ బ్యాంకు పనివేళలను ఎందుకు పాటించడం లేదని ఉద్యోగులను ప్రశ్నించారు. భవిష్యత్‌లో ఎలాం టి సమస్యలు ఎదురైనా నేరుగా తనకు ఫిర్యాదు చేయాలని చెప్పి ఖాతాదారులకు ఏజీఎం తన ఫోన్ నంబర్ ఇచ్చారు. ఖాతాదారులకు ఇబ్బందికలిగిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.

ఎస్‌డబ్ల్యూపీసీల నిర్వహణపై శిక్షణ



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ మోహన్‌రావు

గజపతినగరం రూరల్: గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల(ఎస్‌డబ్ల్యూపీసీ) నిర్వహణపై గజపతినగరం, దత్తిరాజే రు మండలాల పంచాయతీ కార్యదర్శులకు గజపతినగరం ఎస్‌డబ్ల్యూపీసీలో బుధవారం శిక్షణ ఇచ్చారు.అతిథిగా హాజరైన డీఎ ల్పీఓ మోహన్‌రావు మాట్లాడుతూ గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని చెప్పారు. గ్రామాల్లో ఇళ్ల నుంచి తడి,పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ఎస్‌డబ్ల్యూపీసీలకు తరలించడం, సేంద్రియ ఎరువులు తయారు చేయడం, సంపద సృష్టించే విధానాలను వివరించారు. ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, ఎంపీడీఓ కల్యాణి, ఈఓపీఆర్డీ సుగుణాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

బొండపల్లి: బోడసింగిపేట జగన్నన లేఅవుట్‌ను అనుకుని ఉన్న ప్రభుత్వ బందలో కొంతమంది వ్యక్తులు తుప్పలు తొలగించి ఆక్రమణకు పాల్పడుతు న్నారని జైభీమ్ అంబేడ్కర్ యువజన సేవా సంఘం అధ్యక్షుడు బగ్గా ఎర్రయ్య తహసీల్దార్ డోలా రాజేశ్వరరావుకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఆక్రమణలు తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈవిషయాన్ని తహసీల్దార్ వద్ద సాక్షి ప్రస్తావించగా.. ఆక్రమణలపై ఫిర్యాదు అందిన వెంటనే వీఆర్‌ఓను, సచివాలయ సర్వేయర్‌ను అక్కడికి పంపించి సర్వే చేయించామని తహసీల్దార్ చెప్పారు. సర్వే నంబర్ 2,3లో జిరాయితీ భూమి, సర్వే నంబర్ 6లో ప్రభుత్వ బంద ఉందని, జిరాయితీ భూమి వరకు మాత్రమే చదును చేశారని, ప్రభుత్వ బందను చదును చేయవద్దని వారికి సూచిం చామని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ప్రజల పక్షమే

- ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సం
- పార్టీ పతాకాన్ని ఎగురవేసి, కేక్ కట్ చేసిన మాజీ ఎమ్మెల్యేలు కడుబండి, అప్పలనరసయ్య, నాయకులు



శృంగవరపుకోట: ఎస్.కోటలో పార్టీ జెండా ఎగుర వేస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి, నాయకులు

అధికారంలో ఉన్నా లేకున్నా వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ప్రజల పక్షమేనని ఎస్.కోట గజపతినగరం మాజీ ఎమ్మెల్యేలు కడుబండి శ్రీనివాసరావు, బొత్స అప్పలనరసయ్య, చీపురుపల్లి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. ఎస్.కోట, గజపతినగరం, చీపురుపల్లి నియోజకవర్గ కేంద్రాల్లో బుధవారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఎస్.కోట దేవి జంక్షన్‌లో మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ముందుగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేసి, కేక్ కట్ చేశారు. గజపతినగరంలోని పార్టీ కార్యాలయంలో బొత్స అప్పలనరసయ్య పార్టీ జెండాను ఎగురవేసి, నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. చీపురుపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం ఆధ్వర్యంలో పార్టీ ఆ నియోజకవర్గ నాయకులు పార్టీ జెండాను ఎగురవేసి. కేక్ కట్ చేశారు. ఆయా నియోజకవర్గాల్లో మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, పార్టీలోని వివిధ విభాగాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

– శృంగవరపుకోట/గజపతినగరం/చీపురుపల్లి రూరల్



గజపతినగరం: కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



చీపురుపల్లిరూరల్: చీపురుపల్లిలో పార్టీ జెండాను ఎగురవేస్తున్న నాయకులు

గడ్డివాము దగ్ధం



మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్న స్థానికులు

కొత్తవలస: మండలంలోని నిమ్మలపాలెం గ్రామంలో బుధవారం సాయంత్రం సంభవించిన అగ్నిప్రమాదంలో రైతు గొంప కృష్ణమూర్తికి చెందిన గడ్డివాము దగ్ధమయ్యింది.స్థానికులు తెలిపిన వివరాలు...గడ్డి కుప్ప మీదుగా ఉన్న విద్యుత్ తీగలపై పక్కనే ఉన్న కొబ్బరి చెట్టు కమ్మ పడడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగా యి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోగా అక్కడే ఉన్న బోరు నుంచి బిందెలతో నీళ్లు తీసుకువచ్చి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ మంటలు అదుపులోకి రాలేదు. అగ్నిమాపక వాహనంలో నీరు తక్కువగా ఉండడంతో మంటలను అదుపుచేయడంలో వారు కూడా విఫలమయ్యారు. అగ్నిమాపక సిబ్బంది తీరుపై స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. సుమారు మూడు ట్రాక్టర్ లోడ్ల గడ్డి కాలిపోయిందని బాధిత రైతు కృష్ణమూర్తి లబోదిబో మంటున్నారు.